సాక్షి
సిద్దిపేట
ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



సాహిత్యంపై చెరగని ముద్ర

తెలుగు సాహిత్యంపై అంబేడ్కర్ చెరగని ముద్ర వేశారని వక్తలు పేర్కొన్నారు.

వివరాలు 8లో ▸



ముక్కు మూసుకోవాల్సిందే..

పలుచోట్ల డ్రైనేజీలు నిండి మురుగు రోడ్లపై పారుతోంది. వీధుల్లో నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. వివరాలు 9లో ▸



సమగ్ర సస్య రక్షణతో..

సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించడం వల్ల వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఏఓ బి.శ్రీనాథ్ సూచించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

కొలంబో, లండన్ కాన్ఫరెన్స్‌లకు రండి

న్యూరోసర్జన్ తిరుమల్‌కు ఆహ్వానం



దుబ్బాక: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో అడిషనల్ న్యూరోసర్జన్‌గా పనిచేస్తున్న దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన డాక్టర్ ఎర్రగుంట తిరుమల్‌కు అంతర్జాతీయ ప్రతిష్టాత్మక సదస్సులకు ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 13 నుంచి 17 వరకు కొలంబోలో జరిగే శ్రీలంక అసోసియేషన్ న్యూరోసర్జన్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించనున్నారు. అలాగే మే 11 నుంచి 14 వరకు లండన్‌లో జరిగే యూరోపియన్ సొసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ (ఈఎస్‌పీఎన్) 29వ వార్షికోత్సవంలో ప్రసంగించనున్నారు. కొలంబోలో జరిగే కాన్ఫరెన్స్‌కు మన దేశం నుంచి ముగ్గురు ప్రముఖ న్యూరోసర్జన్‌లకు ఆహ్వానం అందగా.. వారిలో తిరుమల్ ఒకరు. లండన్ కాన్ఫరెన్స్‌కు ఇండియా నుంచి కేవలం తిరుమల్‌కు మాత్రమే అవకాశం లభించడం విశేషం. ప్రతిష్టాత్మకమైన కొలంబో, లండన్ కాన్ఫరెన్స్‌లకు ఆహ్వానం అందడం పట్ల తిరుమల్ సంతోషం వ్యక్తం చేశారు.

బాలభీముడు!



శిశువుతో ముంతాజ్

హుస్నాబాద్: పట్టణంలోని కేబీ కాలనీకి చెందిన ఎస్.కె ముంతాజ్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం అధిక బరువుతో ఉన్న మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువు 4 కిలోల 300 గ్రాముల బరువుతో ఉన్నాడు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ రెడ్డి తెలిపారు. ముంతాజ్‌కు ఇదివరకు ముగ్గురు ఆడపిల్లలు కాగా, నాల్గవ సంతానంగా మగబిడ్డ జన్మించడంపట్ల వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.


'సేద్య పరిశీలన' గ్రంథం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్లు

మిరుదొడ్డి(దుబ్బాక): 'వ్యవసాయ అభివృద్ధి' అన్న అంశంపై తాను రాసిన 'సేద్య పరిశీలన' పరిశోధన గ్రంథాన్ని నల్లగొండలో ఆవిష్కరించారని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. లింగంపేట నర్సింహులు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో నీటి పారుదల, వ్యవసాయ అభివృద్ధిపై రాసిన గ్రంథాన్ని ప్రొఫెసర్ కోదండరాంరెడ్డి, ఎన్‌యూఈపీఏ న్యూఢిల్లీ, మాజీ వైస్ చాన్స్‌లర్ బీబీజీ తిలక్, నల్గొండ మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ప్రొ. రేవతి, ఇంద్రకాంత్, ముత్యంరెడ్డి ఆవిష్కరించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



బీస్మాట్ స్టేట్ జనరల్ సెక్రటరీ మల్లారెడ్డిని సన్మానిస్తున్న జిల్లా ప్రతినిధులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బీస్మాట్) స్టేట్ జనరల్ సెక్రెటరీగా మల్లారెడ్డి అన్నారు. బీస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవ ఎన్నికను పురస్కరించుకొని శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టీఫెన్ హైస్కూల్లో మల్లారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలకు సహాయ సహకారాలను ఎల్లవేళలా అందిస్తానన్నారు. విద్యార్థులను రాష్ట్రంలో విద్యారంగంలో, సేవారంగంలో ఉన్నతులుగా తీర్చిదిద్దాలని స్టీఫెన్ హైస్కూల్ ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో బీస్మాట్ జిల్లా ప్రతినిధులు భగవాన్‌రెడ్డి, సికిందర్, స్టీఫెన్ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, కరస్పాండెంట్ స్వామిదాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఫలితాల్లో కాంగ్రెస్‌కు గుండు సున్నా

సంగారెడ్డి రూరల్: కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేయకపోతే ఢిల్లీలో పట్టిన గతే తెలంగాణలో కూడా పడుతుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ శనివారం ఓ ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు.

పల్లె పోరుకు సన్నాహాలు

ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ

- రేపటి నుంచి ఆర్‌ఓలు, పోలింగ్ సిబ్బందికి
- ఎన్నికల నిర్వహణకు 11,737 మంది సిబ్బంది
- జిల్లాలో 508 పంచాయతీలు, 4,508 వార్డులు



ఎన్నికల శిక్షణ సామగ్రిని అందజేస్తున్న డీపీఓ దేవకీదేవి

సాక్షి, సిద్దిపేట: పంచాయతీ ఎన్నికల సమరానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీకాలం పూర్తికావడంతో ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ప్రచారం సాగుతోంది. ఆదిశగా జిల్లా యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. జిల్లాలో 26 మండలాలు ఉండగా.. 508 గ్రామ పంచాయతీలు, 4,508 వార్డులు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ కోసం 11,737 మంది సిబ్బందిని నియమించారు. వీరికి సోమవారం నుంచి ఎన్నికల నిర్వహణ, నియమాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

10 మంది మాస్టర్ ట్రైనర్ల ఎంపిక

పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు 10 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేశారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో వీరికి శిక్షణ పూర్తి కాగా ఆర్‌ఓ, పీఓ, ఓపీఓలకు వీరు శిక్షణ ఇవ్వనున్నారు. నాలుగు నుంచి ఐదు గ్రామాలకు కలిపి ఒక రిటర్నింగ్ అధికారి చొప్పున స్టేజీ-1లో 174, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు 177 మందిని నియమించారు. వీరు సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్లను స్వీకరించనున్నారు. ఇక స్టేజీ- 2లో పోలింగ్ నిర్వహణ కోసం రిటర్నింగ్ ఆఫీసర్లు 508, ప్రిసైడింగ్ అధికారులు 4,959, పోలింగ్ క్లర్క్‌లు 5,919 మందిని నియమించారు.

ఆర్డీఓలకు బాధ్యతలు

ఈ నెల 10, 11 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ బాధ్యతలను ఆర్డీఓలకు అప్పగించారు. సిద్దిపేట ఆర్డీఓ పరిధిలో సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాలకు చెందిన పోలింగ్ సిబ్బందికి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. గజ్వేల్, హుస్నాబాద్ సిబ్బందికి ఐఓసీలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ శాఖలలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ నుంచి డిగ్రీ కళాశాల ఆధ్యాపకుడి వరకు ఎన్నికల విధులు అప్పగించారు. వీరికి ఇప్పటికే శిక్షణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సిబ్బందికి సంబంధించిన సామగ్రిని శిక్షణ కేంద్రాలకు పంపిస్తున్నారు. వీటిని సిబ్బందికి అందించనున్నారు.

12 వరకు శిక్షణ పూర్తి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు, సిబ్బందికి ఈనెల 12వ తేదీ వరకు శిక్షణ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఇందుకోసం ఎన్నికల సిబ్బందికి ఇచ్చే సామగ్రిని ఆయా ఆర్డీఓలకు పంపిస్తున్నాం. ఇప్పటికే ఎన్నికల సిబ్బందికి ఆదేశాలు పంపించాం. జిల్లాలో రెండు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. బ్యాలెట్ పేపర్ సైతం జిల్లాకు చేరింది.

- దేవకీదేవి, డీపీఓ

ఎమ్మెల్సీ ఓటర్లు @ 77,962

- ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితా
- ఉమ్మడి మెదక్‌లో 71 మండలాల్లో 174 పోలింగ్ స్టేషన్లు



సంగారెడ్డి జోన్: ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను అధికారులు విడుదల చేశారు. తుది జాబితాను బట్టి మొత్తంగా ఉమ్మడి మెదక్‌లో 77,962 మందికి ఎమ్మెల్సీ ఓటుహక్కు లభించింది. ఇక ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 71 మండలాల్లో 174 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. పట్టభద్రులలో ఉమ్మడి మెదక్ జిల్లాలో సిద్దిపేటలో 32,589గా ఉండగా, ఉపాధ్యాయులలో సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 32,12గా ఉన్నారు. గతేడాది డిసెంబరు 30న ప్రకటించిన తుది జాబితాలో 71,622మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో 77,962 మంది ఓటర్లు ఉన్నారు. అంటే 6,340 మంది ఓటర్లు పెరిగారు.

జిల్లాల వారీగా పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓటర్ల వివరాలు

జిల్లా	పట్టభద్రులు	ఉపాధ్యాయులు	మొత్తం
సంగారెడ్డి	25,652	2,690	28,342
మెదక్	12,472	1,347	13,819
సిద్దిపేట	32,589	3,212	35,801

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ఉమ్మడి జిల్లా నుంచి 1,677 మంది హాజరు



పరీక్ష కేంద్రం పరిశీలిస్తున్న వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ రాజేందర్

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు శనివారం వివిధ కేంద్రాలలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్‌లోని 10 పరీక్ష కేంద్రాలలో ఈ పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 2,610 మందికి గాను 1,677మంది విద్యార్థులు హాజరయ్యారు. 11వ తరగతి ప్రవేశపరీక్షకు మొత్తం 1,621 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 1,114 (68.72%) మంది హాజరైనట్లు నవోదయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ పేర్కొన్నారు. 9వ తరగతి ప్రవేశపరీక్షకు 989 మందికి గాను 563 (56.93%) విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

బర్డ్‌ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతి

తూప్రాన్: బర్డ్‌ఫ్లూపై కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పర్యవేక్షణాధికారి డాక్టర్ తిరుపతి సూచించారు. శనివారం పట్టణంలోని పశు వైద్యశాలలో జిల్లాలోని చిన్నశంకరంపేట, చేగుంట, మనోహరాబాద్, తూప్రాన్ మండలాలకు చెందిన నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు చోట్ల బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. ఈ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు లక్ష్మి, కావ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళతాం

- త్వరలోనే గజ్వేల్‌లో సీఎం పర్యటన
- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



గజ్వేల్‌లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: పేద, బడుగు వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ముందుకెళ్తుందని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1, 2 వార్డుల్లో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పథకాలను గడపగడపకు చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉన్నదని చెప్పారు. కేసీఆర్‌ను మూడోసారి గజ్వేల్‌లో గెలిపిస్తే ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే ఇక్కడ పర్యటించి సమస్యలను తీరుస్తానని హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రెండో వార్డు అధ్యక్షుడిగా మల్లారెడ్డిని, మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థిగా మహేశ్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన పంట... పశువులకు మేత



ఇన్నాళ్లు కంటికి రెప్పలా కాపాడుకున్న వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోవడం.. బావులు, బోర్లలో నీళ్లు లేకపోవడంతో రైతులు చేసేదేమి లేక పంటను పశువుల మేతకు వదిలేస్తున్నారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్‌కు చెందిన గోనే కిష్టయ్యకు ఐదెకరాల వ్యవసాయ పొలం ఉంది. అందులో రెండు బావులు ఉన్నాయి. రెండెకరాల్లో మొక్కజొన్న, మూడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. మొత్తం లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాడు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న పంటలు చివరి దశలో ఉన్నాయి. బావుల్లో నీరు అడుగంటడంతో బోర్ల నుంచి సరిగా నీరు రావడం లేదు. దీంతో శనివారం పశువులను మేపుతున్నాడు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

డక్కలి కులానికి అన్యాయం చేయొద్దు

సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు శివకుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎస్సీ కులాల్లో అత్యంత వెనుకబడిన డక్కలి కులానికి అన్యాయం చేయకుండా వర్గీకరణలోని లోపాలను సవరించాలని డక్కలి సంఘం జిల్లా యువజ న అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణలో భాగంగా గ్రూప్-1లో అన్ని రకాలుగా ముందు ఉన్న పంబాల, మన్నే కులాలను చేర్చారన్నారు. దీంతో తమకు రావాల్సిన రిజర్వేషన్‌లను వారు పొందుతారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ శాస్త్రీయంగా జరగలేదని, ఆర్థికంగా, సామాజికంగా ముందు వరుసలో ఉన్న కులాలను గ్రూప్-1లో చేర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఇప్పటికే వెనకబడిన కులాలు మరింత వెనుకబడే అవకాశం ఉందన్నారు. డక్కలి కుల జనాభా రాష్ట్రంలో 20 వేలకు పైగా ఉంటే.. కేవలం 2,558 మాత్రమే ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం లెక్కల్లో చూపడం సరికాదన్నారు. పంబాల, మన్నే కులాలను వెంటనే గ్రూప్-1 నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

గోకులం.. ఇది గిరికులం



గోమందల నిలయాలుగా మొదల్లకుంట, నర్సింగరావుపల్లి తండాలు

- జంట తండాల్లో 250 పైగా ఆవులు
- లేగ దూడలతో కానులు
- గో సంపద పరిరక్షణలో గిరిజనులు
- ఒక్కో గో మాతకు ఒక్కో పేరు
- మలం, మూత్రంతో సేంద్రియ ఎరువులు తయారీ

సండే స్పెషల్

'గో రక్షణ -దేశ రక్షణ కంటే ఏ మాత్రం తక్కువ కాదు' అన్నాడు గాంధీజీ. అవును మేము సైతం ఆయన బాటలోనే అంటున్నారు పాపన్నపేట మండలం నర్సింగరావుపల్లి, మొదల్లకుంట తండా గిరిజనులు. చెంగు చెంగున దూకే లేగ దూడలు.. అంబా అని అరిచే.. గోమాతలతో ఆ రెండు తండాలు గిరి కులాలుగా కాకుండా.. గోకులాలుగా కనిపిస్తాయి. నర్సింగరావుపల్లిలోని సామ్యా, తులసీరాం, అమ్రూ, లక్ష్మణ్, మొదల్లకుంటలోని ధర్మా, ఫకీరా కుటుంబీకులు తర తరాల నుంచి ఆవులను పెంచుతున్నారు. ఈ రెండు తండాల్లో కలిసి పదేళ్ల కిందట సుమారు వెయ్యి ఆవులుండేవి. ప్రస్తుతం సుమారు 250 వరకుఆవులున్నాయి. 8లో

-భట్టు మోహన్ రాజు, పాపన్నపేట(మెదక్)

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను దూరం పెట్టారు
- గతంలో దీక్షలు చేసింది రాజకీయం కోసమేనా?
- ముఖ్యమంత్రి రేవంత్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ



సాక్షి, సిద్దిపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాటి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోసి, అధికారంలోకి రాగానే మల్లన్నసాగర్ భూ నిర్వాసితుల సమస్యలకు దూరంగా ఉండటం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మండిపడ్డారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల పక్షాన నిరాహార దీక్షలు చేసింది రాజకీయమేనా అని ధ్వజమెత్తారు. ఇదేనా మీ నిరాహార దీక్షకు ఫలితమని నిలదీశారు. కోర్టు కేసుల్లో తీర్పు వచ్చిన వారికి, అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయిన వారికి పరిహారం అందించాలని కోరుతూ శనివారం సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. బీఆర్‌ఎస్ మల్లన్నసాగర్ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీని అందించిందన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ప్రతీ నిర్వాసితుడికి గజ్వేల్ పట్టణ సమీపంలోనే 250 గజాల ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణానికి రూ. 5.04 లక్షలు, రూ. 7.5 లక్షల పరిహారం అందజేశామన్నారు. ఇందు కోసం రూ. 1,260 కోట్లను ఖర్చు చేసి నిర్వాసితులకు అత్యంత ప్రాధాన్యతను కల్పించామని తెలిపారు. 90 శాతం మందికి పరిహారం ఇచ్చామన్నారు. కోర్టు కేసులో తీర్పు వచ్చిన మిగితా 10 శాతం మందికి, అక్కడక్కడ ప్యాకేజీ మిస్సయిన వారికి అందిచాల్సి ఉందన్నారు. వెంటనే వీరికి పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాడు మేము తక్కువ పరిహారం ఇచ్చామని ఆరోపణలు చేశారు.. ఇప్పుడు సీఎం హోదాలో ఎక్కువ పరిహారం ఇచ్చి నిర్వాసితుల దగ్గర మీ మాట నిలబెట్టుకోవాలన్నారు.

మార్చి నెలాఖరుకు పనులు పూర్తి

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న అన్ని రకాల పనులను మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శనివారం పంచాయతీ రాజ్ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ఉపాధి హామీ పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మనుచౌదరి మాట్లాడుతూ...జిల్లాలో ఉపాధి హామీ పనుల కింద చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులకు ఎఫ్‌టీవో జెనరేట్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే డీఆర్డీవో అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. ఉపాధి పనుల్లో స్థానిక కాంట్రాక్టర్లకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

డంపుయార్డు మాకొద్దు

నర్సాపూర్: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపుయార్డు ఏర్పాటు చేయొద్దని విద్యార్థులు శనివారం ఆందోళనకు దిగారు. ఈ మేరకు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. డంప్‌యార్డు ఏర్పాటు చేయడం వల్ల పార్యానగర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలు, చెరువులు కాలుష్యమయంగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డంప్‌యార్డు మాకొద్దు.. పచ్చని చెట్లు ముద్దు అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అక్షయ్‌గౌడ్, అభినాష్, అర్జున్, రాకేష్, సాయిరాం, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఢిల్లీలో విజయం.. గల్లీలో సంబురం



ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు తిన్నారు. ఎక్కడ ఎన్నిక జరిగినా బీజేపీదే విజయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గురువారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– గజ్వేల్‌రూరల్

క్లుప్తంగా

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం, పీఈటీ

నంగునూరు(సిద్దిపేట): జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఇద్దరు గట్లమల్యాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం రమేశ్, పీఈటీ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఇటీవల తూప్రాన్‌లో నిర్వహించిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన బీ.ఈశ్వరి, డీ.అను చక్కటి ప్రతిభ కనబర్చారన్నారు. 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జాతీయ జట్టుకు ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయిల్‌ఫామ్ ఫెడరేషన్ ఫార్మర్స్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షురాలు రేణుక, వేణుగోపాల్, గ్రామ ప్రజలు అభినందించారు.

మంజీరా వాగులో మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంజీరా వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన చిలప్‌చెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులో గల చాముండేశ్వరీ ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. శనివారం ఎస్‌ఐ నర్సింలు కథనం మేరకు.. మంజీరా వాగులో మృతదేహం తేలియాడుతుందనే సమాచారం రావడంతో ఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాళ్లతో వెలికి తీయించామన్నారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై లేత ఆకుపచ్చ రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంటు, చేతికి వాచ్ ధరించి ఉంది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టమ్ నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

గజ్వేల్‌లో మరో మృతదేహం

గజ్వేల్‌రూరల్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించిన ఘటన శనివారం గజ్వేల్ పట్టణంలో వెలుగుచూసింది. గజ్వేల్ సీఐ సైదా కథనం మేరకు.. పట్టణంలోని 11వ వార్డు (ఢిల్లీవాల హోటల్)లోని శివయ్య అనే వ్యక్తికి చెందిన పెంకుటింట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తలుపులు తెరిచి చూడగా కుళ్లిన స్థితిలో బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్న వ్యక్తి మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉండి వారం రోజుల కిందట మృతి చెందినట్లు తెలుస్తుందన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆచూకీ తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని సీఐ సైదా తెలిపారు.

పాపన్నపేట మండలంలోని నర్సింగరావుపల్లి అనే గిరిజన తండా అది. అక్కడో గిరిజనుడు ఆవులనుద్దేశించి 'యే బింగరి.. గోదారి.. ధోళి..పుడి.. యౌడియా.'అని అరుస్తున్నాడు. ఇదేంటి అర్థం కాని భాష అనుకుంటున్నారా! అవును అది గిరిజన భాష. మొదట ఉన్నది గోమాతల పేర్లు. యౌడియా అంటే ఇటు రా అని అర్థం. గోవులను మేతకు తీసుకెళ్లేందుకు వాటిని ఇలా పురమాయిస్తున్నాడు తులసీరాం అనే గిరిజనుడు.

– పాపన్నపేట(మెదక్):

గోకులం.. ఇది గిరికులం

గోమందల నిలయాలుగా మొదల్లకుంట, నర్సింగరావుపల్లి తండాలు

- జంట తండాల్లో 250 పైగా ఆవులు
- లేగ దూడలతో కానులు
- గో సంపద పరిరక్షణలో గిరిజనులు



మొదల్లకుంట తండా



అడవిలో మేతకు వెళ్తున్న ఆవుల మంద

పాపన్నపేట మండలం నర్సింగరావుపల్లి, మొదల్లకుంట తండా గిరిజనులు ఆవులను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. నర్సింగరావుపల్లిలోని సామ్యా, తులసీరాం, అమ్రూ, లక్ష్మణ్, మొదల్లకుంటలోని ధర్మా, ఫకీరా కుటుంబీకులు తర తరాల నుంచి ఆవులను పెంచుతున్నారు. కండలను కరిగించి కొండలను పిండి చేసి.. రాళ్ల భూమిలో రతనాలు పండించే గిరి పుత్రులు మూగ జీవాలను పోషించడంలోనూ అంతే శ్రద్ధ చూపుతున్నారు. ఒక్కో ఆవు నుంచి యేటా రూ.10 వేల వరకు ఆదాయం వస్తుంది. ఇళ్ల ముందు తెల్లని ఆవుల మందలు మంచు దుప్పట్లను తలపిస్తాయి. అంబా అనే కూతతో మొదలయ్యే వారి జీవన పయనం సూర్యాస్తమయం వరకు చెట్లు గుట్టలతో.. వాగు వంకలతో.. పచ్చని పంటల మధ్య గడుస్తుంది.

సేంద్రియ ఎరువులు.. లేగ దూడలు

గో సంపదతో గిరిజనులు బహుళ ప్రయోజనాలు పొందుతున్నారు. ఆవు మల, మూత్రాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని చేసే క్రిమి సంహారకాలు, రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులతో పంటలు పండించుకుంటున్నారు. ఆవులు యేటా ఒక ఈత ఈనుతాయి. రెండేళ్ల వయస్సుండే లేగ దూడ సుమారు రూ.20 వేల ధర పలుకుతుంది. గోవుల పాలు మాత్రం అమ్మకుండా కేవలం ఇంటి వినియోగానికే వాడుకుంటారు. మిగితా వాటిని దూడలకు వదులుతుంటారు. పుణ్య కార్యక్రమాలకు గోవు పేడ, మూత్రం, పిడకలు ఉచితంగా ఇస్తుంటారు. నూతన గృహ ప్రవేశాలకు సైతం ఆవులను ఉచితంగానే పంపుతుంటామని గిరిజనులు చెబుతున్నారు.

పచ్చి మేత.. తాగు నీళ్లు కరువై

జంట తండాలకు సుమారు 3 కిలో మీటర్ల దూరంలో మంజీరా పరివాహ ప్రదేశం ఉంది. ఒకప్పుడు నిజాంసాగర్ శికం భూమి పచ్చని గడ్డితో కళకళలాడేది. దీంతో ఈ రెండు తండాలకు చెందిన ఆవుల మందల మేతకు కరువుండేది కాదు. నది మడుగుల్లో కావాల్సినంత తాగు నీరు ఉండేది. రాను రానూ పరిస్థితులు మారాయి. శికం భూములను సైతం వదలకుండా పంటలు సాగు చేస్తున్నారు. దీంతో ఆవుల మందలు ఆకలి కేకలతో విల లాడుతున్నాయి. తప్పని పరిస్థితిలో అడవిలోకి వెళ్తున్నాయి. అక్కడ కూడా పచ్చి గడ్డి దొరక్క దొరికింది మేసి, మూగ వేదనతో ఇళ్లకు మళ్లుతున్నాయి. ఎండా కాలం వచ్చిందంటే చాలు, గుక్కెడు నీటికి ఇబ్బందే. ఇళ్ల ఎదుట స్థలం కూడా లేకుండా పోతుంది. దీంతో గత్యంతరం లేని పరిస్థితిలో మూగ జీవాలను అమ్మకానికి పెడుతున్నారు. కొన్నింటిని కటికె వాళ్లకు, మరి కొన్ని పెంపకానికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. గో సంరక్షణ కోసం ప్రభుత్వం నెల నెలా కొంత నగదు ఇవ్వాలని, గోశాలలు ఏర్పాటు చేయాలన్న అభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి.



బోరు నీటితో మూగ జీవాల కోసం ఏర్పాటు చేసిన నీటి మడుగు



దూడకు పాలు ఇస్తున్న ఆవు

కన్యాదానంతో పాటు గోదానం



కన్యాదానంతో పాటు గోదానం చేయడం మా ఆనవాయితీ. ఆడపిల్ల కట్నం కింద నా మనవరాళ్లు వీణ, పీక్లిలకు ఆవు, దూడలను దానంగా ఇచ్చాం. నా పొలానికి పశువుల పేడతో తయారైన ఎరువును వాడుతా. ఒకప్పుడు మా ఇంట్లో 300 ఆవులు ఉండేవి. రోజు రోజుకూ వాటి పోషణ భారమవుతోంది. మేపడానికి వెళ్లే మనిషికి అన్నం, బట్టలు పెట్టి, యేటా రూ.లక్ష జీతంగా ఇవ్వాలి. మేతకు పచ్చిగడ్డి, తాగు నీరు దొరకడం లేదు.ముఖ్యంగా వేసవి కాలంలో పరిస్థితి దారుణం. దీంతో మూగ జీవాలను అమ్మక తప్పడం లేదు.

– ధర్మా, మొదల్లకుంట తండా

పోషణ కోసం నగదు ఇవ్వాలి



నాకు తెలిసినప్పటి నుంచి ఆవులను మేపడానికి వెళ్తున్నాను. ఉదయం 10 గంటలకు ఆవులతో కలసి అడవిలోకి వెళ్తుంటా. తిరిగి సాయంత్రం 7 గంటలకు ఇంటికొస్తా. ఆవులంటే నాకు ప్రాణం. ఒక్కో ఆవుకు ఒక్కో పేరు పెట్టుకున్నా. నేను పిలిస్తే అవి ఆగిపోతాయి. అడవిలో నీరు దొరకదు. అందుకే మా తండా వాసులు బోరు నీళ్లతో ఒక మడుగు తయారు చేశారు. రాను రాను మేత దొరకడం లేదు. ఆవుల పెంపకం, వాటి మేత కోసం ప్రభుత్వం నెలకు కొంత నగదు ఇవ్వాలి.

– తులసీరాం, నర్సింగరావుపల్లి

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాజస్థాన్‌కు చెందిన గంగ విషన్ (21) నెల రోజుల కిందట అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో గల సాయి అంబికా కాలనీకి వచ్చాడు. వీరి గ్రామానికి చెందిన వికాస్, మహేందర్‌తో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తనకు జీతం సరిపోడం లేదని దీంతో అప్పులు చేయాల్సి వస్తుందని స్నేహితులతో చెప్పుకునేవాడు. శుక్రవారం సాయంత్రం తీవ్ర మనస్తాపంతో రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు మహిపాల్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్య సమస్యలతో యువకుడు



శ్రీవర్ధన్‌రెడ్డి (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని ధర్మరాజ్‌పల్లి గ్రామానికి చెందిన యాంజాల్ లక్ష్మారెడ్డి, అనిత దంపతులు కొన్నేళ్లుగా దండుపల్లి గ్రామంలో జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు శ్రీవర్ధన్ రెడ్డి (24) ఉన్నా రు. కూతుళ్ల వివాహం జరిగింది. కుమారుడు డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్దనే ఉంటూ బయట దేశానికి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. కొద్ది రోజులుగా శ్రీవర్ధన్ రెడ్డి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొలం వద్ద గుర్తు తెలియని వ్యక్తి..

సిద్దిపేటఅర్బన్: గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో శనివారం వెలుగు చూసింది. సిద్దిపేట త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు.. మిట్టపల్లి గ్రామ శివారులో అమీర్‌ఖాన్‌కు చెందిన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకున్నాడని స్థల యజమాని పోలీసులకు తెలిపాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి ఆచూకీ కోసం వెతకగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయసు 35 నుంచి 38 ఏళ్లు ఉంటుందని, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి ఎడమ చేతిపై తనూజ అనే పేరు ఇంగ్లిషులో పచ్చబొట్టు వేసి ఉంది. మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. భూమి యజమాని అమీర్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ బంగారంతో మోసం

- నలుగురిపై కేసు నమోదు
- నర్సాపూర్ ముత్తూట్ మినీ ఫైనాన్స్‌లో వెలుగులోకి

నర్సాపూర్: నకిలీ బంగారం పెట్టి తూకంలో మోసం చేసిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ లింగం కథనం మేరకు.. శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్కుల గ్రామానికి చెందిన గుండె రాజు నర్సాపూర్‌లోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ షేర్ ఆఫీసులో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన సురేశ్, ఆకాశ్‌లతోపాటు సంస్థలో బంగారం తనిఖీ చేసి ఆమోదించే ప్రవీణ్‌తో కలిసి నకిలీ బంగారంతోపాటు తూకంలో మోసం చేసి ముత్తూట్ మినీ ఫైనాన్స్ షేర్ సంస్థ నుంచి రూ.7,20,356 తీసుకున్నారు. ఈ విషయం బయట పడగానే రాజు విధులకు రావడం మానేశాడు. సంస్థ రీజినల్ మేనేజర్ ముప్పాల రాజు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

వ్యక్తికి గాయాలు

గజ్వేల్‌రూరల్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. రాయపోల్‌కు చెందిన కర్ణాకర్ శనివారం బైక్‌పై బేగంపేట నుంచి గజ్వేల్ వైపు వస్తున్నాడు. ఇదే క్రమంలో గజ్వేల్ నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న కారు కోమటిబండ సమీపంలో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి బైక్‌పై వస్తున్న కర్ణాకర్‌ను ఢీకొంది. సమాచారం అందుకున్న 108 వాహన పైలెట్ శ్రీకాంత్, ఈఎంటీ వర్షిత ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సాహిత్యంపై అంబేడ్కర్ చెరగని ముద్ర



సదస్సులో వక్తలు, రచయితలు

- అసమానతలను అధిగమించే చైతన్యం
- పాఠ్య ప్రధానమైన చర్చ అవసరం
- సెమినార్‌లో వక్తలు

సిద్దిపేటజోన్: తెలుగు సాహిత్యంపై అంబేడ్కర్ చెరగని ముద్ర వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో శనివారం రాత్రి ప్రజాస్వామిక రచయితల వేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం–అంబేడ్కర్ ప్రభావం అనే అంశంపై పలువురు మాట్లాడారు. సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. సిద్దిపేటలో రెండు రోజుల పాటు సదస్సు జరగడం సంతోషంగా ఉందన్నారు. అంబేడ్కర్ ఒకప్పుడు మను ధర్మం మీద పోరాటం చేస్తే, ప్రస్తుతం అదే మను ధర్మం పునరుద్ధరణ చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు పేర్కొన్నారు. అనుభవం అనేది జ్ఞానం ఆధారంగా, అధ్యయనం ఆధారంగా అనే రెండు రూపాల్లో వస్తుందని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యం కూడా జ్ఞానం, అధ్యయనం అనే రెండింటి ద్వారా వస్తుందన్నారు. అంబేడ్కర్, గాంధీ, వివేకానంద లాంటి గొప్పవాళ్ల గురించి అధ్యయనం చేయకుండా మాట్లాడే వాతావరణం ప్రస్తుతం ఉందన్నారు. జీవితాన్ని ముందుకు నడిపే సాహిత్యాన్ని అధ్యయన రూపంలో చర్చ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠ్య ప్రధానమైన చర్చ అనేది చాలా ముఖ్యమన్నారు. అనంతరం ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. దళిత బహుజన సాహిత్యానికి అంబేడ్కర్ తాత్వికత అన్నారు. నేడు జరుగుతున్న సాహిత్యం, నడుస్తున్న చరిత్ర అంతా బహుజన, తాత్విక సిద్ధాంత పునాదుల మీద నడుస్తుందన్నారు. సదస్సులో తిరుపతి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ మధు జ్యోతి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజాస్వామిక రచయితల వేదిక అధ్యక్షురాలు రజిత, ప్రొఫెసర్లు ఐలయ్య, కోటేశ్వరరావు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రచనలపై అవగాహన

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శనివారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రచనలపై అవగాహన కల్పించారు. వర్ధన్నపేట, భూపాలపల్లి డిగ్రీ కళాశాలల సహాయాచార్యులు వంగల సంపత్‌రెడ్డి, గుత్తికొండ చంద్రకళలు కౌముది, ఇల్లెందులు సరస్వతీదేవి రచనలను గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు మట్టా సంపత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కవుల జీవితాలను అధ్యయనం చేస్తూనే వారి రచనలు చదవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలుగు అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పిట్ల దాసు, వెంకటరమణ, శైలజ, సాయిసురేష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తూ ఆరుగురు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీను

నంగునూరు(సిద్దిపేట): గంజాయి తాగుతూ ఇతరులకు విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. రాంపూర్ క్రాస్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరుగురు నిందితులను పట్టుకొని 508 గ్రాముల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిని విచారించగా అప్పలాయి చెర్వు గ్రామానికి చెందిన నాయిని రాజశేఖర్ రెడ్డి, జేపీ తండాకు చెందిన గుగులోత్ ప్రవీణ్ ఆసిఫాబాద్ జిల్లా చెరిమేరి మండల కేంద్రానికి చెందిన రవి వద్ద రూ.10 వేలకు కిలో చొప్పున రెండు కిలోల గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిసింది. చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి రూ.900కు విక్రయిస్తుండగా ఇద్దరితో పాటు అప్పలాయి చెర్వుకు చెందిన నాయిని రాంరెడ్డి, రంగదాంపల్లికి చెందిన రోంపల్లి నరేశ్, బద్దిపగకు చెందిన అలకుంట రాకేశ్, గుగులోత్ రాజ్‌కుమార్ పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ముగ్గురు మహిళలు అదృశ్యం

కూలీ పనులకని వెళ్లి..

దుబ్బాకటౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన దుబ్బాక పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన కారంకంటి గంగ (45) కూలీ పని చేస్తూ కుమార్తెతో జీవనం కొనసాగిస్తుంది. రోజు మాదిరిగానే శనివారం కూలీ పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు వీణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లి..

సంగారెడ్డి క్రైమ్: మహిళ అదృశ్యమైన ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణానికి చెందిన ఇందూరి మల్లికార్జున్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి రోజూ ఇంట్లో తన వల్లే అత్తామామలకు గొడవలు జరుగుతున్నాయని మల్లికార్జున్ భార్య అవ్వమ్మ భావించి 7వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైరాన్‌పల్లి గ్రామంలో..

మద్దూరు(హుస్నాబాద్): మహిళ అదృశ్యమైన ఘటన మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పుష్పాల సింధుప్రియ (25) శుక్రవారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త పుష్పాల కనుకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కుల గణనలో తక్కువ చూపడం సరికాదు

సిద్దిపేటకమాన్: కుల గణనలో మున్నూరు కాపులను తక్కువ సంఖ్యలో చూపించడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన ద్వారా బీసీలు 42 శాతం ఉన్నారని అందులో మున్నూరు కాపులు 8 శాతం మాత్రమే ఉన్నారనడం పూర్తిగా అవాస్తవం అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో మున్నూరు కాపులు 18 శాతం ఉన్నట్లు ప్రకటించిందని గుర్తు చేశారు. వాస్తవ లెక్కలను ప్రజల ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, శేఖర్, కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిమెంట్ నిర్మాణాలకు డిమాండ్

- రోజురోజుకూ పెరుగుతున్న వినియోగం
- ఇటుకలు, రింగులు, స్తంభాలు
- జిల్లాలో జోరుగా తయారీ కేంద్రాలు
- ఉపాధితోపాటు ఆదాయం



సిమెంట్ పలకలతో దేవులపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం



సిమెంట్‌తో తయారు చేసిన స్తంభాలు

హత్నూర(సంగారెడ్డి): గతంలో ఇంటి నిర్మాణాలకు మట్టి ఇటుకలు, కలప కిటికీలను వాడేవారు. నేడు నిర్మాణ రంగంలో మార్పులు చోటు చేసుకొని సిమెంట్ రింగులు, కిటికీలు, వెంటిలేటర్లు వినియోగిస్తున్నారు. ఎక్కువగా సిమెంట్‌తో తయారు చేసిన వాటికే మొగ్గు చూపుతున్నారు. అలాగే, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం, పేద మధ్య తరగతి కుటుంబాల గృహ నిర్మాణాలు, ఇతర బహుళ అంతస్తుల నిర్మాణం కోసం సిమెంటు ఇటుకల సరఫరా పెరిగింది. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని భూములకు ప్రహరీ గోడలను సైతం సిమెంట్ పలకలతోనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా సిమెంట్ ఇటుకలు, కిటికీలు, రింగుల తయారీ కేంద్రాలు జిల్లాలో బాగా వెలిశాయి. హత్నూర మండలంలోని పలు గ్రామాలతోపాటు సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, పటాన్‌చెరు, జహీరాబాద్, పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల కూలీలతో పనులు చేస్తున్నారు.

పది నుంచి 15 మందికి ఉపాధి

సిమెంటు ఇటుకలు, రింగులు తయారీ కేంద్రాల్లో ఒక్కో కేంద్రం వద్ద కనీసం 10 నుంచి 15 మందికి ఉపాధి లభిస్తోంది. ఏడాది పొడవునా కూలీలకు ఉపాధితోపాటు ఆదాయం లభిస్తోంది. సిమెంట్ వస్తువులను తయారు చేసే పరికరాలను తరలించేందుకు సులువుగా ఉండటంతో అధిక డిమాండ్ ఉన్న గ్రామాల్లోనే వ్యాపారులు తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రహదారి పక్కన యూనిట్లను ఏర్పాటు చేస్తుండటంతో తయారు చేసిన వస్తువులు తీసుకెళ్లడానికి ప్రజలకు సులువుగా ఉంటుంది.

అభిరుచిని బట్టి ఆకర్షణీయంగా

ఇటుకల తయారీకి సిమెంట్, రాతిపౌడర్, సన్నటి సీకులు ఇతర పౌడర్లను ముడి సరుకులను వినియోగిస్తున్నారు. ఇటుకలే కాకుండా అన్ని సైజుల రింగులు కిటికీలు, పూలతోటలో వెంటిలేటర్లు ఆకర్షించే విధంగా తయారు చేస్తున్నారు. వీటిని వారంపాటు ప్రతిరోజూ తడుపుతారు. వినియోగదారుల నుంచి వచ్చే అభిరుచి, ఆర్డర్లను బట్టి తయారు చేస్తున్నారు. హత్నూర మండలంలోని దౌల్తాబాద్, మంగపూర్, దేవులపల్లి, సిరిపుర, గోవిందరాజ్ పల్లి, నస్తిపూర్ తదితర గ్రామాల్లో జోరుగా తయారు చేస్తున్నారు.

ఆర్డర్‌ను బట్టి తయారీ



ఆర్డర్‌ను బట్టి సిమెంట్ కిటికీలు, రింగులు, ఇటుకలు తయారు చేస్తున్నాం. వినియోగం ఎక్కువగా ఉన్నప్పటికీ ముడి సరుకు రేటు పెరిగిపోయింది. తయారీ కేంద్రాలు కూడా పెరిగాయి. ఇతర రాష్ట్రాల నుంచి తయారీదారులను తీసుకొస్తున్నాం.

– ఇంద్రశేఖర్ రెడ్డి, దేవులపల్లి, నిర్వాహకుడు